

చౌడేశ్వరి అమ్మవారికి బోనాలు

రెంటచింతల: ఆషాఢ మాసం చివరి ఆదివారం చౌడేశ్వరి అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. ప్రధాన అర్చకులు మారుతీశర్మ నేతృత్వంలో పూజలు చేశారు.



లక్ష్మీనరసింహ స్వామికి పూజలు

వినుకొండ : కొండమెట్ల వద్ద ఉన్న లక్ష్మీ నరసింహ స్వామికి 16 రోజుల పండుగ సందర్భంగా ఆదివారం వసంతోత్సవం కనుల పండువగా నిర్వహించారు.



కనకదుర్గమ్మకు బోనాలు

గురజాల: కనకదుర్గ అమ్మవారికి మహిళలు ఆదివారం బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని కోరుకుంటూ పూజలు చేశారు.

మొలకెత్తిన ఖరీఫ్ ఆశలు

- వరుణుడి కరుణతో ఊపందుకున్న పంటల సాగు
- జిల్లాలో సాగు సాధారణ విస్తీర్ణం 1.15 లక్షల హెక్టార్లు
- కాలువలకు సాగునీటి విడుదల పనుల్లో యంత్రాంగం
- విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ

వానదేవుడి కరుణతో అన్నదాతల్లో 'ఖరీఫ్' ఆశలు మొలకెత్తాయి. వర్షాభావంతో దిగాలు పడిన రైతన్నలకు ఇటీవల వానలతో ఊరట లభించింది. సాగు పనులు ఊపందుకున్నాయి. అధికారులు కూడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టారు.



సాక్షి ప్రతినిధి, గుంటూరు: వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు. దాదాపు పదిహేను రోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగి పంటలు మొలక దశలోనే వాడిపోతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో వానదేవుడు కాస్త ఊరటనిచ్చాడు. గత రెండు, మూడు రోజులుగా గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు ఖరీఫ్ పంటలు సాగు చేసుకునేందుకు పొలాల బాట పట్టారు. పంటల సాగు ఊపందుకుంది. వర్షాలు కురిసిన తర్వాత అధికారులు కూడా కృష్ణా డెల్టాకు నీరు విడుదల చేయడం ప్రారంభించారు.

నీటి విడుదలకు చర్యలు

ఇప్పటి వరకు వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సాగు మందగించిందని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, కృష్ణా పశ్చిమ డెల్టా నుంచి నీటి విడుదల వల్ల మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని ప్రాంతాల్లో పంటల సాగు ఊపందుకోనుందని అధికారులు చెబుతున్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టు నుంచి త్వరలో నీరు విడుదల చేయనుండటం, ప్రస్తుత వర్షాలకు తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, పెదనందిపాడు, కాకుమాను, గుంటూరు రూరల్ ప్రాంతాల్లో కూడా పంటల సాగు ఊపందుకునే అవకాశం ఉంది.

అందుబాటులో విత్తనాలు, ఎరువులు

జిల్లాకు ఖరీఫ్ సీజన్‌కు విత్తనాలను వ్యవసాయశాఖ అధికారులు సిద్ధం చేశారు. వరి 14,885, పత్తి 1674, మిరప 273, మొక్కజొన్న 10, ఇతర రకాలు 1,606 కలిపి మొత్తం 18,448 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉంచారు. నెలవారీ ఎరువుల సరఫరా ప్రణాళికను అధికారులు రూపొందించారు. జిల్లాలో హోల్‌సేల్ వర్తకులు, రీటైల్ డీలర్లు వద్ద యూరియా 15,021, డీఏపీ 4,252, కాంప్లెక్స్ ఎరువులు 13,797, ఎంటీపీ 946 కలిపి మొత్తం 34,016 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. సాగు విస్తీర్ణాన్ని బట్టి మరిన్ని ఎరువులు అందుబాటులో ఉంచటానికి చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. సరఫరాలో సమస్యలు ఉంటే జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ నంబరు 8074994631కు ఫోన్ చేయాలని సూచించారు.

జిల్లాలో ఖరీఫ్ పంటల సాగు సాధారణ విస్తీర్ణం 1.15 లక్షల హెక్టార్లు కాగా.. ఇప్పటి వరకు సాగైన పంటల వివరాలు ఇవీ...

పంట రకం	సాధారణ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	ప్రస్తుతం సాగైన విస్తీర్ణం (హెక్టార్లలో)
వరి (వెద)	62,000	6,433
పత్తి	24,000	1,632
మినుము	3,122	114
కూరగాయలు	1,947	450
పసుపు	4,000	730
పండ్ల తోటలు	3,590	2,032
పువ్వులు	437	210
నువ్వులు	-	28
జూట్	-	20
చెరకు	-	10

పంటల సాగుకు ఊపు



ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలు, డెల్టాకు సాగు నీరు విడుదల కారణంగా జిల్లాలో ఖరీఫ్ పంటల సాగు ఊపందుకోనుంది. ఇప్పటి వరకు వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు విస్తీర్ణం మందగించింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఇప్పటికే వేసిన పంటలకు మంచి ఉపయోగకరం. ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాం. ఎరువులు, విత్తనాల విషయంలో రైతులకు సమస్యలు ఉంటే కాల్ సెంటర్ నంబరుకు ఫోన్ చేయవచ్చు.

– అయితా నాగేశ్వర రావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, గుంటూరు

పెదకాకానిలో 77.2 మి.మీ. వర్షపాతం

కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో గత నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా పెదకాకాని మండలంలో 77.2 మిల్లీ మీటర్లు వర్షపాతం పడింది. అత్యల్పంగా తుళ్ళూరు మండలంలో 0.6 మి.మీ. కురిసింది. సగటు 18.4 మి.మీ.గా నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు.. దుగ్గిరాల మండలంలో 67.8 మి.మీ., గుంటూరు తూర్పు 54.2, గుంటూరు పశ్చిమ 40.2, మంగళగిరి 28.2, మేడికొండూరు 13.6, తాడేపల్లి 12.4, ప్రత్తిపాడు 9.6, వట్టిచెరుకూరు 8, ఫిరంగిపురం 7.4, కొల్లిపర 7.2, తాడికొండ 2.8, చేబ్రోలు మండలంలో 1.2 మి.మీ. చొప్పున వర్షపాతం పడింది. జూలై నెల 20వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 106.4 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 93 మి.మీ. నమోదైంది. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు ఖరీఫ్ పంటల సాగు పనులు ముమ్మరం చేశారు.

న్యూస్‌రీల్

మాజీ మంత్రి అంబటి రాంబాబుకు నోటీసులు



సత్తెనపల్లి: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబుకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. గుంటూరులోని ఆయన నివాసంలో ఆదివారం సత్తెనపల్లి రూరల్ ఏఎస్ఐ శ్రీనివాసరావు నోటీసులు అందించారు. గత నెల 18న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన సందర్భంగా జన సమీకరణ చేశారనే నెపంతో నమోదు చేసిన అక్రమ కేసులో విచారణకు హాజరు కావాలని పోలీసులు నోటీసులు అందించారు. ఇప్పటికే దీనిపై పట్టణ పోలీసుస్టేషన్‌లో నమోదైన అక్రమ కేసులో విచారణకు 11న ఆయన హాజరయ్యారు. మరో అక్రమ కేసు సత్తెనపల్లి రూరల్ పోలీస్టేషన్‌లో నమోదు చేయడంతో సోమవారం విచారణకు హాజరు కానున్నారు.

అమ్మ వారికి బోనాలు



దుగ్గిరాల: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా పూల అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవారికి 1000 మంది మహిళలు బోనాలు సమర్పించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఈఓ కె.సునీల్‌కుమార్ పర్యవేక్షించారు.

566.70 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం


విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 566.70 అడుగులకు చేరింది. ఇది 248.2946 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల అవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 67,556 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

అమ్మవారి ఆలయానికి రూ. 4 లక్షల విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సపాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన ఎన్ఆర్ఐలు వజ్రాల క్రాంతికిరణ్, వెంకాయమ్మ దంపతులు, వారి కుమార్తెలు ఇషికారెడ్డి, మహిరా కిరణ్‌రెడ్డిలు రూ.4 లక్షలు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో సంబంధిత చెక్‌ను అందజేశారు. ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళాన్ని గతంలో ప్రకటించడం జరిగిందని, అందులో భాగంగా రూ.4 లక్షలు అందజేశామని దాతలు వివరించారు.

రవిచంద్రకుమార్‌కు అవార్డు



గుంటూరు మెడికల్: ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో 40 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తున్న తెలుగునాడు కమ్యూనిటీ పారా మెడిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, రెడ్ క్రాస్ లైఫ్‌మెంబర్ ఎం.రవి చంద్రకుమార్‌కు నంది అవార్డు లభించింది. ఆయన చేసిన సామాజిక సేవా కార్యక్రమాలు గుర్తించి విజయవాడలోని రితికా ఫౌండేషన్ ఆదివారం అవార్డు ఇచ్చి, సత్కరించింది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నిత్యాచారికి రవి చంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్య భారతి సేవలు భేష్

మంత్రి సత్యకుమార్ యాదవ్



గుంటూరు మెడికల్: ఆరోగ్య భారతి సేవలు అభినందనీయం అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. సంస్థ రాష్ట్ర కార్యకర్తల ప్రాంత అభ్యాస వర్గ సమావేశం ఆదివారం గుంటూరు అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆరోగ్యభారతి సేవలు బాగున్నాయని తెలిపారు. ప్రభుత్వం కూడా ప్రజారోగ్యం కోసం ఆరోగ్య భారతి వంటి సంస్థల సహకారంతో పనిచేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జాతీయ సంఘటన కార్యదర్శి డాక్టర్ అశోక్ కుమార్, సేవా భారతి కార్యదర్శి శ్రీరామశర్మ, జాతీయ సహ సంఘటన కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ రావు, సేవా భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఎన్ చారి, క్షేత్ర సంయోజకులు కుమార స్వామి, ఏపీ సంఘటన కార్యదర్శి కాకాని పృథ్వీరాజ్, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జ్యుడిషియల్ ఆఫీసర్ల సదస్సు

గుంటూరు లీగల్: జిల్లా స్థాయి జ్యుడిషియల్ ఆఫీసర్స్ సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ చక్రవర్తి నేతృత్వంలో ఆదివారం నిర్వహించారు. సదస్సుకు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ హైకోర్టు న్యాయమూర్తి నైనాల జై సూర్య హాజరయ్యారు. న్యాయమూర్తుల పని తీరును, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా సంబంధిత కోర్టులలో విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులు అందరూ హాజరయ్యారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తిని జిల్లా కోర్టు ఉద్యోగులు కలిసి అభినందనలు తెలియజేశారు.

శాకంబరిగా భ్రమరాంబ అమ్మవారు



శాకంబరి దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



ఆలయంలో ఆకుకూరలు, కూరగాయల అలంకరణ

పెదకాకాని: శివాలయంలో భ్రమరాంబ అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢ మాసం పురస్కరించుకుని శ్రీ భ్రమరాంబ అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, డ్రైఫ్రూట్స్, సుగంధ ద్రవ్యాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణం, ధ్వజస్తంభం వద్ద ఆకుకూరలు, కూరగాయల తోరణాలతో అలంకరించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ పర్యవేక్షణలో అర్చకులు, వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. విఘ్నేశ్వరుణ్ణి, నందీశ్వరుడిని, ప్రసన్నాంజనేయస్వామిని, శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని కూడా అలంకరించారు. ప్రత్యేక దర్శనం, అన్న ప్రసాదం ఏర్పాట్లు చేసినట్లు డీసీ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ దంపతులు ఆషాఢ సారె సమర్పించి, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక గ్రామ పెద్దలు, భక్తులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు కుమార్తెలు సహా తల్లి ఆత్మహత్యాయత్నం

– వెంటనే స్పందించి కాపాడిన పోలీసులు

బాపట్లటౌన్: ఒక మహిళ తన ఇద్దరు కుమార్తెలతో కలసి ఆత్మహత్యాయత్నం చేయగా, పోలీసులు సకాలంలో స్పందించి కాపాడారు. ఆదివారం ఉదయం తల్లి, ఇద్దరు కుమార్తెలతో కలిసి రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు వెదుళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు కాల్ వచ్చింది. వెంటనే స్పందించిన ఎస్ఐ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్టూవర్టుపురం రైల్వేస్టేషన్ పరిధిలోని రైల్వే ట్రాక్‌పై మహిళ, ఆమె కుమార్తెలను అదుపులోకి తీసుకొని విచారించారు. దీనికి కుటుంబ వివాదాలే కారణమని తెలుసుకొని, వారి నివాసానికి వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించి, పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించడంతో ముగ్గురు ప్రాణాలు నిలిచాయన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ తుషార్‌డూడీ వెదుళ్లపల్లి ఎస్ఐని ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరికి సమస్యలు ఉంటాయన్నారు. వాటిని సానుకూలంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, ఆత్మహత్య వంటి తీవ్ర నిర్ణయాలు తగవని సూచించారు.

జీవితాన్ని తీర్చిదిద్దిన బైరాగి కవిత్వం



మాట్లాడుతున్న ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

- ప్రముఖ రచయిత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్
- ఘనంగా ఆలూరి బైరాగి, శారదల శతజయంతి సదస్సు

తెనాలి: తెలుగు, హిందీ భాషల్లో గొప్ప రచనలు చేసిన ఆలూరి బైరాగి సాహిత్యం తన జీవితాన్ని మలుపు తిప్పిందని, ఎదగటానికి ఉపయోగపడిందని ప్రసిద్ధ రచయిత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. యువకుడిగా విద్యారంగమా, రాజకీయమా? అనే సంశయాత్మక పరిస్థితుల్లో ఉన్నపుడు గురువు ఆదేశ్వరరావు ద్వారా పరిచయమైన ఆలూరి బైరాగి కవిత్వం తనను ఉన్మాదుడిని చేసిందన్నారు. హిందీ, తెలుగు సాహిత్య రంగాలపై దృష్టి పెట్టి ఒక స్థాయిని సాధించగలిగానని చెప్పారు. సాహిత్య అకాడమీ, పట్టణానికి చెందిన సమరయోధుడు వడ్లమూడి గోపాలకృష్ణయ్య, వెంకటలక్ష్మమ్మ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ఆదివారం ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో తెనాలికి చెందిన ప్రసిద్ధ రచయితలు ఆలూరి బైరాగి, శారదల శతజయంతి సదస్సు నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి అధ్యక్షత వహించారు. ఇందులో ఆచార్య లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. కవిత్వం సహా వివిధ ప్రక్రియల్లో బైరాగి శైలిలో రచనలు చేసిన హిందీ కవులు ఎవరూ లేరని చెప్పారు. బైరాగి హిందీ సాహిత్యంపై సాహిత్య అకాడమీ సదస్సుకు కృషి చేస్తానని చెప్పారు. బైరాగి స్వస్థలమైన తెనాలిలో ప్రతిష్టకని రూ.1.30 లక్షలతో చేయించిన కాంస్యవిగ్రహాన్ని బహూకరించినట్టు గుర్తుచేశారు.

'బైరాగి' సాహిత్య స్వరం విలక్షణం

బైరాగి జీవితం, సాహిత్యంపై ప్రముఖ రచయిత డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ ద్విభాషా పండితుడైన బైరాగిది తెలుగు సాహిత్యంలో ఒక విలక్షణమైన స్వరంగా చెప్పారు. ఎన్నెన్నో అధ్యయనాలు చేసినా తగిన మార్గం నిర్దేశించుకోలేక నిరంతర అన్వేషణ యాత్రికుడిగానే మిగిలి పోయారని అన్నారు. తన కవితా భాషను తానే తీర్చిదిద్దుకున్న బైరాగిలా ఆయన సమకాలికులు ఎవరూ రచనలు చేయలేదన్నారు.

గొప్ప స్త్రీవాది శారద


శారద జీవితం, రచనలపై 'అరసం' జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజాపక్ష ఉద్యమాలను తన కథల్లో ప్రతిబింబించిన శారద గొప్ప స్త్రీవాదిగా చెప్పారు. కార్మికోద్యమాలను విజయాకాంక్షతో చూశారన్నారు. ఆకలి, అనారోగ్యంతోనే అద్భుతమైన సాహిత్య సృజన చేసిన శారద 31 ఏళ్లకే చనిపోయినట్లు పేర్కొన్నారు. శారద మరణాన్ని పాలకులు, ప్రచురణకర్తలు చేసిన హత్యగానే భావించాలని అభిప్రాయపడ్డారు. శారద తెలుగు రచయిత మాత్రమే కాదు...జాతీయ రచయితగా చెబుతూ, శాశ్వత స్మారకం ఉండాలన్నారు. శారద జన్మస్థలి పుదుక్కోటలో స్మృతి చిహ్నం ఏర్పడుతుందన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. సాహిత్య అకాడమీ ప్రోగ్రాం అసిస్టెంట్ టీఎస్ చంద్రశేఖరరాజు స్వాగతం పలుకగా, తెలుగు సలహామండలి సభ్యుడు వల్లూరు శివప్రసాద్, 'శారద' కుమార్తె శారద, అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు మాట్లాడారు. తర్వాత జరిగిన రెండు సదస్సులకు కొత్తపల్లి రవిబాబు, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అధ్యక్షత వహించారు. ఆలూరి బైరాగి, శారద సాహిత్య ప్రక్రియలపై కందిమళ్ల శివప్రసాద్, కొర్రపాటి ఆదిత్య, పేరిశెట్టి శ్రీనివాసరావు, కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ, చెరుకూరి సత్యనారాయణ పత్రసమర్పణ చేశారు.

చిన్నారుల తిండిపైనా చిన్నచూపే!

- కాంట్రాక్టర్ల కక్కుర్తితో నాసిరకం పౌష్టికాహారం పంపిణీ
- కూటమి సర్కారు వచ్చాక అడ్డగోలుగా సరఫరా
- కుళ్లిన కోడిగుడ్లు, పాడైపోయిన కందిపప్పు అందజేత



పాడైపోయిన కంది పప్పు



అంగన్‌వాడీ కేంద్రాల్లో పాడైపోయిన, పగిలిపోయిన కోడిగుడ్లు



ఇటీవల అంగన్‌వాడీ కేంద్రం నుంచి తీసుకున్న కుళ్లపోయిన కోడి గుడ్డు

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నచూపు చూస్తోంది. కనీసం వారికి మంచి ఆహారం అందించేందుకు కూడా పాలకులకు మనసు రావడం లేదు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారం పంపిణీలో కాంట్రాక్టర్లు చేతి వాటం చూపుతున్నారు. నాసిరకం ఆహారం, సరుకులు సరఫరా చేస్తూ ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. వారిపై చర్యలు మాత్రం శూన్యం.

అంతా నాసిరకం

గుంటూరు అర్బన్ పరిధిలో కుళ్లిపోయిన కోడిగుడ్లు, పాడైపోయిన కందిపప్పు చూసి లబ్ధిదారులు షాకయ్యారు. దీన్ని పౌష్టికాహారం అంటారా అని మండిపడుతున్నారు. జిల్లాలో 1,480 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 6 నెలల నుంచి మూడేళ్లలోపు వయస్సున్న చిన్నారులు 49,976 మంది కాగా.. 3–6 సంవత్సరాలలోపు వారు 14,771, గర్భిణులు 9,148, బాలింతలు 7,009 మంది ఉన్నారు. కాంట్రాక్టర్లు కక్కుర్తితో నాసిరకం ఆహారం పంపిణీ చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. ముడుపులు తీసుకుని అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

కూటమి దెబ్బకు కష్టాలు

గత ప్రభుత్వం హయాంలో అందరికీ సక్రమంగా పౌష్టికాహారం అందేది. వీటిలో కోత విధించేందుకు కూటమి ప్రభుత్వం కొత్త నిబంధనలు తెచ్చింది. ఆధార్ వెరిఫికేషన్ (ఈకేవైసీ), ఫేస్ రికగ్నేజేషన్ (ముఖ ఆధారిత ధ్రువీకరణ) ఉంటేనే పౌష్టికాహారం అందిస్తున్నారు. ఆధార్‌కు లింక్ చేసిన ఫోను నంబర్లు చాలామందికి అందుబాటులోకి లేక ఓటీపీలు రావడం లేదు. ఆధార్ అప్‌డేట్ చేయించుకోకపోవడం వల్ల ఫేస్ రికగ్నేజేషన్ కాక ఆహారం తీసుకోలేకపోతున్నారు. నాణ్యత లేని పౌష్టికాహారం సరఫరాపై గుంటూరు అర్బన్ సీడీపీఓ అరుణను వివరణ కోరగా... కాంట్రాక్టర్లతో మాట్లాడి మంచి పౌష్టికాహారం అందించేలా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వ్యవసాయ కోర్సుల వెబ్ ఆప్షన్లకు గడువు పెంపు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే కళాశాలల్లో డిప్లమో కోర్సుల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకునేందుకు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాదికి అగ్రికల్చర్ డిప్లమో కోర్సులో ప్రవేశానికి అనుమతించామని పేర్కొన్నారు. తిరుపతి డిప్లమో కళాశాల 2025–26 ఏడాది ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో చూడొచ్చని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

క్లుప్తంగా

'స్వచ్ఛ' అవార్డు రావడంపై సీఎం అభినందన



నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత పోటీల్లో గుంటూరు నగరపాలక సంస్థ 'సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్ అవార్డు' పొందింది. ఈ సందర్భంగా గుంటూరు నగరపాలక సంస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం అభినందించారు. తిరుపతిలో జరిగిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రభుత్వం తరఫున పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్‌లతో కలిసి ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని నగరపాలక సంస్థ అధికారులకు అందజేశారు. కార్యక్రమానికి కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి ఎంహెచ్‌ఓ జె.రామారావు, ప్రజారోగ్య విభాగ కార్మికులు హాజరయ్యారు.

మల్లిక స్పయిన్ సెంటర్‌కు అవార్డు



డాక్టర్ జె. నరేష్‌బాబు

గుంటూరు మెడికల్: గుంటూరులోని మల్లిక స్పయిన్ సెంటర్ పరిశోధనా బృందానికి సొసైటీ ఫర్ మినిమల్లీ ఇన్‌వేసీవ్ స్పయిన్ సర్జరీ అండ్ ఆసియా పసిఫిక్ (స్మిస్ అండ్ ఆసియా పసిఫిక్ సొసైటీ) వార్షిక సదస్సులో ప్రదర్శించిన పరిశోధనకు 'బెస్ట్ పేపర్ అవార్డు' దేశంలోనే తొలిసారి లభించింది. సెంటర్ అధినేత, సీనియర్ స్పయిన్ సర్జన్ డాక్టర్ జె. నరేష్ బాబు నేతృత్వంలోని బృందం ఈ పరిశోధన చేసింది. అల్ట్రాసోనిక్ టెక్నాలజీని ఎండోస్కోపిక్ స్పయిన్ సర్జరీకి అన్వయించి అతి సమర్థంగా చేసే తీరుపై పరిశోధన చేశారు. ఆదివారం సెంటర్‌లో డాక్టర్ నరేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ... అవార్డుతోపాటు బృందంలోని సభ్యుడైన డాక్టర్ పృథ్వీరెడ్డికి ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని ప్రముఖ సర్జరీ కేంద్రాలను సందర్శించే ట్రావెల్ ఫెలోషిప్ కూడా లభించినట్లు తెలిపారు. అవార్డును వచ్చే సంవత్సరం సింగపూర్‌లో అందిస్తారని పేర్కొన్నారు. గతేడాది థామస్ వైట్ క్లాడ్ అవార్డును, ఇండియన్ స్పయిన్ సర్జన్స్ అసోసియేషన్ వారి బెస్ట్ స్పయిన్ క్లినికల్ రీసెర్చి జాతీయ అవార్డును కూడా డాక్టర్ నరేష్‌బాబు స్వీకరించారు.

రైలు ఢీకొని యువకుడు మృతి

వినుకొండ: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం వినుకొండలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. వినుకొండ పట్టణ సమీపంలోని డిగ్రీ కళాశాల వైపు వెళ్లు రహదారిలో జక్కంపూడి రామారావు (27) అనే యువకుడు పట్టాలు దాటుతుండగా అటుగా వైపు వెళ్తున్న రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

• దంచికొట్టిన వాన



గుంటూరు నగరంలో ఆదివారం కురిసిన భారీ వానకు కంకరగుంట అండర్‌పాస్ వద్ద నిలిచిపోయిన వర్షపు నీరు



వాననీటిలో ఆటో ఆగిపోవడంతో నెడుతున్న దృశ్యం



మూడు వంతెనలు వద్ద చేరిన వాననీరు

-సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

బెజవాడలో మరో దారుణ హత్య?

- గంజాయి బ్యాచ్ సభ్యులు హత్య చేసి ఉంటారని అనుమానాలు
- భార్య వివాహేతర సంబంధంపై మృతుడి బంధువుల ఆరోపణ
- పోలీసుల అదుపులో మృతుడి భార్య, గంజాయి బ్యాచ్ సభ్యులు



మధురానగర్ వంతెన వద్ద రక్తపు మడుగులో సాదిక్ మృతదేహం

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడసెంట్రల్): విజయవాడలో ఇటీవల జరిగిన జంట హత్యల ఘటనను మరువక ముందే మధురానగర్ వంతెన వద్ద మరో వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన అజిత్‌సింగ్ నగర్ పీఎస్ పరిధిలో ఆదివారం వెలుగు చూసింది. గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 16వ తేదీన ఓ రౌడీషీటర్ రెచ్చిపోయి ఇద్దరు వ్యక్తులను కిరాతకంగా హత్య చేసిన విషయం విదితమే. ఐదు రోజుల వ్యవధిలోనే మరో వ్యక్తి నడిరోడ్డుపై రక్తపు మడుగులో మృతి చెందాడు. వరుస ఘటనలతో ప్రజలు హడలిపోతున్నారు.

రెండు రోజుల్లో ఇంటికొస్తానని చెప్పి..

గుంటూరు జిల్లా మొగలాయిపాలెం గ్రామానికి చెందిన షేక్ సాదిక్ (28)కు నగరంలోని వాంబే కాలనీ ప్రాంతానికి చెందిన కరిష్మతో 2019లో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. సాదిక్ పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. భార్యతో విభేదాల కారణంగా కొన్నేళ్ల నుంచి ఆమెకు దూరంగా ఉంటున్నాడు. ఇద్దరూ విడాకులకు కూడా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇలాంటి పరిస్థితుల్లో అతను మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. గుంటూరులోని తల్లి వద్దే ఉండేవాడు. ఈ నెల 16వ తేదీన విజయవాడ వెళ్లొస్తానని చెప్పి గుంటూరు నుంచి బయలుదేరాడు. 19వ తేదీన తల్లి రిహానాకు ఫోను కాల్ చేసి రెండు రోజుల్లో ఇంటికి వచ్చేస్తానని తెలిపాడు. 20వ తేదీ తెల్లవారుజామున రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించాడు.

కారణాలపై పోలీసుల దర్యాప్తు

సాదిక్ వాంబే కాలనీలో ఉన్న తన భార్యను కలిశాడా, లేదా అనే విషయం నిర్ధారణ కాలేదు. వాంబే కాలనీ నుంచి మధురానగర్ వైపు ఉన్న ట్రెండ్ సెట్ మార్గంలో అక్కడే బస్టాప్ వద్ద రెండు రోజుల నుంచి అతను తిరుగుతూ ఉన్నట్లు తెలిసింది. తమ కోడలికి వివాహేతర సంబంధం ఉందని, వారే తన కొడుకును హతమార్చి ఉండొచ్చని సాదిక్ తల్లి, ఇతర కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సాదిక్ మరణించిన సమయంలో ఒంటిపై దుస్తులు లేకపోవడం, మధురానగర్ వంతెన వద్ద తల పగిలి తీవ్ర రక్తస్రావంతో విగతజీవిగా పడి ఉండటం వారి అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. సాదిక్ బ్యాగులో గంజాయి కూడా పోలీసులకు లభించినట్లు తెలిసింది. గంజాయి మత్తులో ఉండగా గంజాయి బ్యాచ్ సభ్యులకు, అతనికి ఏమైనా గొడవ జరిగి ఉంటుందా? వారే అతడిని హత్య చేసి ఉంటారా? ఏదైనా వాహనం ఢీకొని మరణించాడా? అనే కోణాల్లోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపులో అనుమానితులు

కరిష్మతోపాటు ఘటన జరిగిన ప్రాంతంలో అనుమానితులుగా కనిపించిన గంజాయి బ్యాచ్ సభ్యులను కూడా పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. కరిష్మ మాత్రం భర్త అసలు ఇంటికే రాలేదని పోలీసులకు తెలిపింది. ఘటనా స్థలంలో సీసీ కెమెరా ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. దంపతుల ఫోన్ కాల్ డేటాలను కూడా సేకరిస్తున్నారు. సాదిక్ తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ రిపోర్టు ఆధారంగా సాదిక్ మృతికి కారణాలు త్వరలోనే వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందరి బాధ్యత



జాయింట్ కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ, క్లబ్ కార్యదర్శి దుర్గారావు తదితరులతో విజేతలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అవకాశం ఉన్నంత వరకు క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. అంతర్జాతీయ చెస్ డేను పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఎల్వీఆర్ అండ్ సైన్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన చెస్ పోటీలకు ముఖ్య అతిథిగా జేసీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మేధావుల క్రీడగా మన్ననలు పొందుతున్న చదరంగం సాధన ద్వారా చిన్నారుల్లో ఆలోచనా విధానం మెరుగు అవుతుందన్నారు. బాలలు తమకిష్టమైన క్రీడలో సాధన చేయాలని సూచించారు. అపురూపమైన బాల్యాన్ని కేవలం తరగతి గదుల్లోనే బంధించకూడదని, రోజూ కొంతసేపైనా ఆడుకోవాలన్నారు. ఎల్వీఆర్ క్లబ్‌కు వందేళ్లకుపైగా చరిత్ర ఉందని తెలిపారు. ఎన్నో క్రీడా పోటీలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగడం అభినందనీయం అన్నారు. క్లబ్ కార్యదర్శి యాగంటి దుర్గారావు మాట్లాడుతూ.. బిలియర్డ్స్, క్యారమ్స్ విభాగాల్లో అంతర్జాతీయ క్రీడా పోటీలు సైతం క్లబ్‌లో నిర్వహించామన్నారు. పోటీలకు ఆర్బిట్రేటర్లుగా పి.విజయ్ కుమార్, ఎస్.సురేష్, ఎస్‌కే అబ్దుల్ నబీ, పి.కుమార స్వామిలు వ్యవహరించారు. అనంతరం చిన్నారులకు జేసీతోపాటు క్లబ్ అధ్యక్షుడు ఎం.సుబ్రమణ్యేశ్వరరావు, యాగంటి దుర్గారావు, విజయ్ కుమార్‌లు బహుమతులు అందజేశారు.

అన్ని యూనియన్లు ఏకతాటిపైకి రావాలి

మా – ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా

తెనాలి అర్బన్: రాష్ట్రంలోని సినీ రంగానికి సంబంధించిన అన్ని యూనియన్లు ఏకతాటిపైకి వచ్చి మోసాలను అడ్డుకోవాలని మా – ఏపీ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా పిలుపునిచ్చారు. తెనాలి ఆలపాటినగర్‌లోని మా – ఏపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పుట్టగొడుగుల్లా వివిధ సినీ ఇండస్ట్రీ అసోసియేన్‌లు పుట్టుకొస్తున్నాయని ఆరోపించారు. వీరిలో కొందరు ఆడిషన్ల పేరిట మోసాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిని అడ్డుకునేందుకు పారదర్శకంగా అసోసియేషన్లు నిర్వహిస్తున్న వారందరూ ఒక వేదికపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో తొలి అడుగుగా తెనాలిలో వివిధ అసోసియేసన్ నిర్వాహకుల సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు సరైన అసోసియేషన్‌లను సంప్రదించి, వాటి ద్వారా సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టాలని సూచించారు. ఏపీ సినీ అండ్ టీవీ తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ – విశాఖపట్నం వ్యవస్థాపకులు ఎఎం ప్రసాద్, ఫిల్మ్ చాంబర్ వ్యవస్థాపకుడు అంబటి మధుమోహన్‌కృష్ణలు కూడా మాట్లాడారు. సమావేశంలో నటుడు మిలిటరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలి



మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులపై మండల విద్యాశాఖాధికారుల వేధింపులు ఆపాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం అరండల్‌పేట మూడవ లైనులోని యోగి భవన్‌లో ఆపస్ గుంటూరు జిల్లా శాఖ అభ్యాసవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ. బాలచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ మాట్లాడుతూ 2003– డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర సంఘటన మంత్రి సీహెచ్ శ్రావణకుమార్ , కె.దశపతిలు మాట్లాడారు. అనంతరం భైరిశెట్టి మల్లికార్జునరావు జాతీయ నూతన విద్యా విధానంపై అవగాహన కల్పించారు. వైఆర్‌కే ప్రసాద్‌ను జిల్లా అదనపు కార్యదర్శిగా రాష్ట్ర కమిటీ సమక్షంలో ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి ఎం.సురేష్, రాష్ట్ర మహిళా కన్వీనర్ పి.పద్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు వై.వీరబాబు, జిల్లా కమిటీ సభ్యులు డి.రామాంజనేయులు, ఎస్.ఆదినారాయణ, డి.లక్ష్మణ్, పి.శ్రీనివాసరావు, జి.నాగార్జున రావు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దాడి చేసిన నలుగురిపై కేసు

నిందితులకు రిమాండ్ విధింపు

ముప్పాళ్ల: డబ్బులు కోసం కట్టేసి కొట్టిన కేసులో నలుగురిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ముప్పాళ్ల ఎస్ఐ వి.సోమేశ్వరరావు ఆదివారం తెలిపారు. మండలంలోని దమ్మాలపాడు గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన దమ్మాలపాటి రవి అనే వ్యక్తిని శనివారం తెల్లవారుజామున డబ్బులు ఇవ్వాలంటూ కట్టేసి కొట్టి హింసించిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. బాధితుడు రవి ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన డి.వీరాంజనేయులు, గంధం నాగేంద్రబాబు, వలేటి గోపి, మదార్‌వలి పై కేసు నమోదు చేయటం జరిగిందని ఎస్ఐ తెలిపారు. వారిని సత్తెనపల్లి తహసీల్దార్ ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు.

రాష్ట్ర దేవాంగ పురోహిత పరిషత్ అధ్యక్షుడిగా రామారావు

వేటపాలెం: దేవాంగ పురోహిత పరిషత్ నూతన అధ్యక్షుడిగా చల్లా రామారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేశాయిపేట పంచాయతీ ఆమోదగిరిపట్నంలోని సాయిబాబా కల్యాణ మండపంలో దేవాంగ పురోహిత పరిషత్ 4వ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ముందుగా ప్రాంగణంలోని దేవాంగ వంశీయుల కులదేవత రామలింగ చౌడేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర దేవబ్రాహ్మణ (దేవాంగ) పండిత అర్చక పురోహిత నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కొలువుల మల్లికార్జునరావు, పన్నెం బాలశంకర్, అంబాబత్తుల అండకొండ రాముడు, ప్రధాన కార్యదర్శిగా చల్లా లక్ష్మణరావు, సహాయ కార్యదర్శిగా కడి మల్లేశ్వర సిద్ధాంతి, దంతం శివ హనుమంతరావు, కోశాధికారిగా ఉట్ల మహదేవ మూర్తి, ఉప కోశాధికారులుగా ఉట్ల ఏకాంబరం, గుంటు దుర్గాప్రసాద్, అధికార ప్రతినిధులుగా బి.ఆనంద నాగప్రసాద్, యువజన విభాగం అధ్యక్షులుగా సజ్జా రాఘవ, సభ్యులుగా బండారు పరవేశ్వరయ్య, బొప్పన మోహనబాబు, బి.విఘ్నేష్, ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు.

12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలి

ఎస్టీయూ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జోసెఫ్ సుధీర్‌బాబు

నరసరావుపేట ఈస్ట్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జూలై 2023 నుంచి అమలు చేయాల్సిన 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని రాష్ట్రోపాధ్యా సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు జోసెఫ్ సుధీర్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఎస్టీయూ పల్నాడు జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎల్.వి.రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులకు రావలసిన 11వ పీఆర్సీ ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, పెండింగ్ ఉన్న కరువు భత్యం బకాయిలు విడుదల చేయాలని సుధీర్‌బాబు డిమాండ్ చేశారు. ప్రభుత్వం యోగా, మెగా పీటీఎం, స్వచ్ఛ అంధ్ర-స్వర్ణాంధ్ర పేరుతో బోధనేతర కార్యక్రమాలు చేపట్టటం వలన పాఠశాలల్లో బోధనా కార్యక్రమాలు కుంటుపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా శక్తి పేరుతో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఒత్తిడి చేయడం భావ్యం కాదన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్‌ఎం సుభాని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.గంగాధరబాబు, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడు అనిల్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఏ.ఏ మండీ, ఎస్టీయూ గుంటూరు జిల్లా పూర్వ అధ్యక్షుడు గేరా మోహనరావు, కరిముల్లా, ఉపాధ్యాయ వాణి కన్వీనర్ జె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించకపోవటం శోచనీయం

ఏపీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసరావు

రేపల్లె: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు జూన్ నెల జీతాలు ఇప్పటికీ చెల్లించకపోవడం శోచనీయమని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ తేలప్రోలు శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. రేపల్లెలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉపాధ్యాయులు నెలల తరబడి వేతనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడడం దురదృష్టకరమన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల పొజిషన్ ఐడీలు ఇంకా క్రియేట్ చేయకపోవడం వల్ల జీతాలు అందించే ప్రక్రియ ఆగిపోయిందని, ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.

బారులు తీరి.. సారెనిచ్చి..



ముఖమండపం వద్ద భక్తుల రద్దీ, (ఇన్‌సెట్‌లో) దుర్గమ్మవారు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు రికార్డు స్థాయిలో భక్తబృందాలు సారెను సమర్పించాయి. ఆదివారం తెల్లవారుజామున ఆరు గంటలకు ప్రారంభమైన భక్తుల రద్దీ రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. ఆదివారం ఒక్క రోజే సుమారు 80 వేలకు పైబడి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రద్దీ నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్ని దర్శన టికెట్ల విక్రయాలను నిలిపివేసి, భక్తులందరిని అన్ని టికెట్ల క్యూలైన్‌లోకి ఉచితంగా అనుమతించి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శించుకున్న వంద మంది భక్తులలో దాదాపు 80 మంది చేతిలో అమ్మవారి సారె ఉండటం విశేషం. అమ్మవారికి సారెను సమర్పించేందుకు విచ్చేసిన భక్తులతో మహా మండపం 5వ అంతస్తు వరకు క్యూలైన్లు కిటకిటలాడాయి. మధ్యాహ్నం అమ్మవారిని మహా నివేదన సమర్పించేందుకు గాను అరగంటపాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. మహానివేదన అనంతరం తిరిగి దర్శనాలు ప్రారంభం కాగా క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా త్వరితిగతిన దర్శనం అయ్యేలా ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు సమన్వయంతో చర్యలు తీసుకున్నారు.

కిటకిటలాడిన ఆరో అంతస్తు..

మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తిని సారెను చూపేందుకు భక్త బృందాలు క్యూ కట్టాయి. ఉదయం 10 గంటల తర్వాత భక్త బృందాలతో ఆరో అంతస్తు కిటకిటలాడింది. అమ్మవారికి సారెను చూపేందుకు రెండు గంటలకు పైగా సమయం పట్టింది. మహా మండపం లిఫ్టు, మెట్లమార్గంతో పాటు ఘాట్‌రోడ్డు, పాత మెట్ల మార్గం ద్వారా భక్తులు కొండపైకి చేరుకున్నారు. ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం ఆరో అంతస్తుకు చేరి సారెను సమర్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక, ఒడిశాల నుంచి కూడా భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. ఆదివారం ఉదయం నుంచే అంతరాలయ దర్శనాలను ఆలయ ఈవో శీనానాయక్ రద్దు చేశారు. ఉదయం 10 గంటల తర్వాత వీఐపీ దర్శనాలను సైతం నిలిపివేసి, బంగారు వాకిలి దర్శనం కల్పించారు. మధ్యాహ్నం వరకు ఇదే పరిస్థితి కనిపించింది. మహా మండపం లిఫ్టు మార్గం ద్వారా కేవలం వికలాంగులు, వృద్ధులు, చంటి పిల్లల తల్లులు, నడవలేని వారికి మాత్రమే కొండపైకి తీసుకెళ్లారు.

• వైభవం.. ఆడి కృత్తిక మహోత్సవం



పలు రకాల పూల అలంకరణలో దర్శనం ఇస్తున్న స్వామివారు



పిడుగురాళ్ల పురవీధుల్లో సుబ్రహ్మణేశ్వర స్వామి విగ్రహంతో ఆడి కృత్తిక కావడి మహోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవాలయంలో ఆదివారం ఆడికృత్తిక మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆషాఢ కృత్తిక పురస్కరించుకొని ఆలయ పూజారి వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో పట్టణంలోని జానపాడు రోడ్డులో ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నుంచి కావడి మహోత్సవ కార్యక్రమం నాగుల గుడిలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వరకు నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై కావడి మహోత్సవం నిర్వహించారు. అనంతరం సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, పుణ్య దంపతులు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ADMISSIONS

■ 10th పాస్ అయిన వారికి సువర్ణ అవకాశం. అగ్రికల్చర్ వెటర్నరీ, MPHW (F), MLT కోర్సులకు అడ్మిషన్ జరుగుచున్నవి. ఒకేషనల్ జూనియర్ కాలేజ్, గుంటూరు. 73867 06839

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర : 87907 41166

WANTED

■ Wanted Experienced Computer Accountant Should Know Hindi and English for Details Contact: 9160607468, 9441547482

■ తెనాలిలోని ప్రముఖ దంత వైద్యశాలకు కంప్యూటర్ ఆపరేటర్ Only Female కావలెను. ఆకర్షణీయమైన జీతం. 9am to 9pm సంప్రదించండి. 81065 22261

■ Wanted B-pharmacy D- pharmacy candidates to work in a pharmacy in Guntur City. Pci Registration Mandatory. 63009 75241

■ We are hiring an experienced Skill Development Center Manager to oversee our training operations, manage staff and ensure the delivery of high quality traning programs. 99499 21480

■ MNC Company Opportunity Full Time / Part Time Monthly Good Income, Qualification: Intermediate. Ph no: 62813 44544

■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 9963521122, 9963101122

■ గుంటూరు, పెదేవర్ల, నరసరావుపేట, రేపల్లె బ్రాంచ్‌లకి డెలివరీ బాయ్స్ కావలెను. లైసెన్సు బైక్ స్మార్ట్‌ఫోన్ మస్ట్, మంచి జీతం+ఫ్యూయల్+ PF, ESI. Ph : 8686242288/ 9391717062

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4 లైన్లు) ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

గుంటూరు 7075167663 7075167541

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.